# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కొత్త ఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 వేల కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.**
2. **తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.**
3. **రాష్ట్రంలో మహిళా సాధికారత ఎలా ఉందో ప్రపంచానికి చాటాలని ఆంధ్రప్రదేశ్ మానవ వనురుల శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ఆదరణ 3 పథకాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.**
5. **ప్రభుత్వం ఇప్పటి వరకూ 50 నుంచి 60 వేల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించిందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.**

==========================

కొత్త ఢిల్లీలో ఈ రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 వేల కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో రహదారుల అనుసంధానం మెరుగుపరిచడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ట్రాఫిక్ సమస్యను తగ్గించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌లను ప్రధాన మంత్రి ప్రారంభించనున్నారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

--------------------------

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాదులో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు అవసరమైన ఔషధాలు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రధానంగా హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

రాష్ట్రంలో మహిళా సాధికారత ఎలా ఉందో ప్రపంచానికి చాటాలని ఆంధ్రప్రదేశ్ మానవ వనురులు, ఐటీ

శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 'స్త్రీ శక్తి' పథకంలో భాగంగా ఉచిత బస్సు టికెట్‌తో సెల్ఫీ దిగి "ఫ్రీ బస్ టిక్కెట్ సెల్ఫీ" అని ట్యాగ్ చేసి పోస్ట్ చేయాలని మహిళలను సామాజిక మాధ్యమ వేదికగా కోరారు. సురక్షితంగా.. గౌరవంతో కూడిన ఉచిత బస్సు ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మహిళకు కల్పిస్తోందని వెల్లడించారు.

-----------------------------

త్వరలో ప్రారంభించనున్న ఆదరణ 3 పథకంలో గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ గౌతు లచ్చన్న 116వ రాష్ట్ర స్థాయి జయంతోత్సవ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ..

వాయిస్...25 సెకన్లు

సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో ప్రభుత్వం బీసీ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొంటూ...

వాయిస్... 30సెకన్లు

-----------------------------

వర్షాల కారణంగా తెలంగాణలో ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల తాత్కాలిక పునరుద్ధరణకు చర్యలు వెంటనే చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాదులో ఆర్ అండ్ బి శాఖ ఉన్నతాధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అధికారులు జిల్లా కేంద్రాల్లోనే ఉండాలని, క్షేత్ర స్థాయి పరిస్థితులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకూ కల్వర్టులు, లో లెవెల్ వంతెనలు, కాజ్ వేల వద్ద ఇంజినీర్లు విధిగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ప్రాణనష్టం జరగకుండా ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

-----------------------------

దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని, రేపు వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరోక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాలో చెదురుమదురుగా భారీ నుంచి అతి భారీ వర్షాలు, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నందున, ఎల్లుండి వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళరాదని సూచించారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ 50 నుంచి 60 వేల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించిందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కృష్ణాజిల్లా

గన్నవరం మండలం కేసరపల్లిలో నిన్న నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

ప్రజలకు అండగా ఉంటామని తెలంగాణ అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరంగల్ జిల్లా హన్మకొండ రాంనగర్‌లోని తమ నివాసంలో నిన్న ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను వింటూ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలు ఏ సమస్య ఉన్న నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని సూచించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమె అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీ వర్ష సూచన కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పాల వినియోగం పెరగటంతో పాడి పరిశ్రమకి డిమాండ్ పెరిగిందని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని ఎన్టీఆర్ జిల్లా మునగచెర్ల గ్రామంలో చంద్రన్న సామూహిక గోకులం షెడ్డును ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందేలా కృషి చేస్తామని తెలిపారు.

---------------------------

దక్షిణ ఒడిషా, ఉత్తరాంధ్రప్రదేశ్ ప్రాంతాలలో అల్పపీడనానికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం చత్తీస్‌ఘడ్, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మీ తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

=====================